క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



రుద్రూర్: మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో ఆదివారం చలివేంద్రాన్ని కంట్రోలర్ అన్వర్ ఖాన్ ప్రారంభించారు. ఎండల తీవ్రత పెరిగినందున వివిధ ప్రాంతాల నుంచి బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి బోధన్ డిపో మేనేజర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశామని బస్టాండ్ కంట్రోలర్ అన్వర్ ఖాన్ వెల్లడించారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

ఎల్‌వోసీ అందజేత



బాల్కొండ : మెండోరా మండల కేంద్రానికి చెందిన ప్రవంతి అనే బాలిక చెవి చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి రూ.4 లక్షల 50 వేలను డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మంజూరు చేయించారు. అందుకు సంబంధించిన ఎల్‌వోసీ కాపీని ఆదివారం ఆమె కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యం రెడ్డి, నాయకులు రవి, రమేశ్, మహేందర్, అశోక్, అనిల్, నవీన్, సాయిరాం, శంకర్, జీవన్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



వేల్పూర్: జాన్కంపేట్ ప్రైమరీ స్కూలులో అటెండర్‌గా 40 ఏళ్లు పనిచేసి ఇటీవల అనారోగ్యంతో మరణించిన చేంగల్‌వాసి బట్టు పెద్ద బాలయ్య కుటుంబానికి ఆదివారం స్థానిక ఎస్సీ సంఘం సభ్యులు రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేశారు. చాలా ఏళ్లు పనిచేసినా ఆయన కుటుంబం నిరుపేద స్థితిలో ఉండడంతో తమవంతు తోడ్పాటు అందించాలని సహాయం చేశామన్నారు. గ్రామస్తులు కూడా ఇటీవల రూ.40,500 నగదు అందించారు. సభ్యులు సొడ ప్రభాకర్‌రావు, తలారి శేఖర్, ఎడ్ల సిరిల్‌రావు, తలారి కిషన్, సొడ రూపేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన తొపారం మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన కుమ్మరి గంగారాం మృతి చెందడంతో వారి కుటుంబాన్ని, ముప్కాల్ మండలం వెంచిర్యాల్‌లో పాశపు శ్రీనివాస్ తల్లి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని, మెండోరా మండల కేంద్రంలో జమాలుద్దీన్ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట ముప్కాల్, మెండోరా మండలాల పార్టీ అధ్యక్షులు ముత్యంరెడ్డి, కొత్తింటి ముత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

రుద్రూర్: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న సైకిలిస్ట్‌ను ఢీకొనడంతోనే ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రూ.40 కోట్ల ఆస్తి పన్ను వసూలు

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను బకాయిలు రూ.40 కోట్ల వరకు వసూలయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను బకాయిల కోసం అధికారులు ఉద్యోగులు సిబ్బంది కలిసి కట్టుగా శ్రమించారు. రూ.42 కోట్ల టార్గెట్‌తో ముందుకెళ్లారు. ఆర్థిక సంవత్సరం ముగింపు చివరి రోజు ఆదివారం వరకు రూ.40 కోట్ల వరకు ఆస్తి పన్ను బకాయిలు వసూలైనట్లు డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ తెలిపారు.

ప్రభుత్వ పైసలు ‘తుప్పు’ పాలు

- ఎస్సారెస్పీలో తుప్పు పట్టిపోతున్న వాహనాలు
- వేలం వేయని అధికారులు
- కండీషన్ వాహనాలను కూడా సర్‌ప్లస్ చేసిన అధికారులు



తుప్పుపట్టి శిథిలమైన ట్రాక్టర్



పనికిరానివిధంగా తయారైన వాహనాలు

బాల్కొండ: ప్రభుత్వ సొమ్మే కదా ఎటు పోతే మాదేం పోతుంది.. అన్నట్లుగా ఎస్సారెస్పీ అధికారులు భావించినట్లున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలనీలో పలు అవసరాల నిమిత్తం గతంలో కొనుగోలు చేసిన వాహనాలు తుప్పు పట్టి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. కాని ఇప్పటికి ఆ వాహనాలను వేలం వేసి వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వానికి జమ చేద్దామన్న ఆలోచన చేయడం లేదు. ఫలితంగా రోజు రోజుకు తుప్పు పట్టి మట్టిలో కూరుకు పోతున్నాయి. ఎస్సారెస్పీ కాలనీలో అధికారులు నివాసం ఉన్న కాలంలో చెత్తను తరలించటానికి ట్రాక్టర్, నీటి సరఫరాకు వ్యాటర్ ట్యాంకర్, అధికారుల పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లటానికి బస్సు లాంటివి ప్రభుత్వమే సరఫరా చేసేది. అంటే ఎస్సారెస్పీ కాలనీలో నివాసం ఉండే అధికారులపై ప్రభుత్వాలు ఎంత శ్రద్ధ చూపేదో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న అధికారులకు సరైన గూడు కూడా లేదు. వాహనాలను సర్‌ప్లస్ చేసి వాటర్ ట్యాంకు ఆవరణలో గత 20 ఏళ్ల నుంచి నిల్వ ఉంచారు. కాని రోజు రోజుకు తుప్పు పట్టి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. ట్రాక్టర్ ఇంజిన్‌పై మొక్క మొలకెత్తి చెట్టుగా ఎదిగింది. కాని ఇప్పటికీ ఆచెట్టును కూడ తొలిగించలేదు. సర్‌ప్లస్ చేసిన వాహనాలకు వేలం పాట నిర్వహించాలి. కాని ఏళ్ల నుంచి వేలం వేస్తామంటున్నారే తప్ప ఇప్పటికి కార్యరూపం దాల్చలేదు.

లీజుపైనే మోజు..

ఎస్సారెస్పీ అధికారులకు లీజుపైనే మోజు ఉంటుందని విమర్శలున్నాయి. ప్రాజెక్ట్ హౌజ్ ముందరగా మంచి కండిషన్‌లో ఉన్న మూడు వాహనాలను ఆరు ఏళ్ల క్రితం సర్‌ప్లస్ చేసి ప్రాజెక్ట్ హౌజ్ ముందర పెట్టారు. అవి తుప్పు పట్టి పోతున్నాయి. ఆరేళ్ల క్రితం స్కార్పియో వాహనాన్ని ఎస్ఈ వినియోగించారు. అంతలోనే సర్‌ప్లస్ చేసి మూలన పాడేశారు. అక్కడ మూడు వాహనాలు ఎండకు ఎండుతు.. వానకు తడుస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సర్‌ప్లస్ చేసిన వాహనాలను వేలం పాట నిర్వహించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వాస్తుతో పాటు తలరాత మారేనా ?



కంచెను తొలగించిన అనంతరం మున్సిపల్ ప్రధాన ద్వారం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ రాజకీయంలో ఎత్తులకు పైఎత్తులతో పాటు వాస్తు సైతం ప్రధాన పాత్ర పోషిస్తోంది. పది సంవత్సరాల క్రితం కంచెతో మూసివేయబడ్డ మున్సిపల్ ప్రధాన ద్వారం మళ్లీ తెరుచుకుంది. గత మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత్‌పై అవిశ్వాస తీర్మానం అనంతరం నూతన చైర్మన్ ఎంపిక ప్రక్రియ మూడున్నర నెలల పాటు కొనసాగింది. నూతనంగా చైర్ పర్సన్‌గా ఎన్నికైన వన్నెల్‌దేవి లావణ్య పదవీ బాధ్యతలు చేపట్టిన పది రోజులకు వాస్తులో భాగంగా కంచె బద్దలైంది.

పండితులపై ఆధారపడుతున్న ప్రజాప్రతినిధులు

రాజకీయ భవిష్యత్ కోసం ప్రజాప్రతినిధులు పండితులను నమ్ముకుంటున్నారు. రాజకీయ ఎదుగుదలకు, పదవులను కాపాడుకోవడానికి అర్థ బలంతో పాటు పండితుల సూచనలు, సలహాలను పాటిస్తున్నారు. ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గతంలో బాధ్యతలు చేపట్టిన స్వాతి సింగ్ బబ్లూ వాస్తురీత్యా మున్సిపల్ ప్రధాన ద్వారాన్ని కంచెతో మూసివేశారు. స్వాతిసింగ్ బబ్లూ 2014 నుంచి 2019 వరకు చైర్‌పర్సన్‌గా కొనసాగారు. పదవి చేపట్టిన సంవత్సరానికి 2015లో పండితుల సలహా మేరకు మున్సిపల్ ప్రధాన ద్వారాం నుంచి రాకపోకలను నిలిపివేయడానికి కంచెను ఏర్పాటు చేశారు. పది సంవత్సరాల అనంతరం ప్రస్తుత చైర్‌పర్సన్ వాస్తు రీత్యా కంచెను తొలగించి మళ్లీ రాకపోకలను ప్రారంభించారు.

నేత కార్మికులకు పని కల్పించాలి



సభకు హాజరైన సంఘం సభ్యులు



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు నారాయణ

బోధన్: చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు పని కల్పించాలని సంఘం సభ్యులు కోరారు. బోధన్ చేనేత సహకార సంఘం 72వ మహాజన సభ ఆదివారం సంఘం అధ్యక్షుడు మోత్కూరి నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ.. సంఘంలో ఉత్పత్తి చేస్తున్న బెడ్ షీట్ విక్రయానికి రుద్రూర్‌లో వస్త్ర విక్రయశాల ఏర్పాటు చేయాలన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న లుంగీలు, టవల్స్ తదితర వస్త్రాలు కొనుగోలు చేసి బెడ్ షీట్‌లతో పాటు వీటిని విక్రయించాలని తీర్మానించారు. చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తించేటట్టు చూడాలని, సంఘానికి రావాల్సిన అద్దె బకాయిలు పెండింగ్‌లో పెట్టకుండా వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు గోనె దత్తాత్రి, డైరెక్టర్లు నూత్పల్లి గణేష్, లోకం భూమయ్య, గంగుల శంకర్, పుల్లె లక్ష్మి, సంఘం మేనేజర్ ఈర్వ నాగరాజు, కార్యదర్శి అంకం నర్సింలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం అభివృద్ధికి కృషి చేద్దాం



సమావేశమైన సాలూర గ్రామ పెద్దలు

బోధన్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం(లైబ్రరీ)లో పాఠకులకు సౌకర్యాలు కల్పించేందుకు సమిష్టిగా కృషి చేద్దామని సాలూర గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఆదివారం సాలూర తహసీల్ ఆఫీసు ఆవరణలో గ్రామ పెద్దలు సమావేశమయ్యారు. ముఖ్యంగా లైబ్రరీ నిర్వహణ కోసం ఆర్థిక వనరుల సమీకరణపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. లైబ్రరీ శాశ్వత సభ్యత్వం ద్వారా విరాళాలు సేకరించాలని నిర్ణయించారు. శాశ్వత సభ్యత్వం పొందిన వారికి లైబ్రరీ అభివృద్ధి కమిటీలో అవకాశం కల్పించాలని ఆమోదించారు. ఈ సభ్యత్వాన్ని ఆసక్తిగల గ్రామ ప్రజలు, విద్యావంతులు ఉగాది పండుగ వరకు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు గడువు ఇవ్వాలని సూచించారు. పీఆర్‌టీయూ జిల్లా ప్రతినిధి ఇల్తెపు శంకర్, ఐడీసీ ఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, సీనియర్ జర్నలిస్టు గడ్డం గంగులు, గ్రామ పెద్దలు బుద్దె రాజేశ్వర్, సంగమేశ్వర్ మహారాజ్, ఇల్తెపు రమేష్, సింగాడి పాండు, కేజీ గంగారాం, మిద్దెల రాజు, రాజ్‌కుమార్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛ కాలనీ కార్యక్రమం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ప్రతి ఆదివారం రెండు గంటలు అనే నినాదంతో స్వచ్ఛ కాలనీ- సమైక్య కాలనీ కార్యక్రమం కొనసాగుతుంది. కాలనీలోని రోడ్డు నెంబర్-1లో శ్రమదానం చేసి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి కొమ్మలను, ముళ్ల పొదలను అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్ కు మార్ మాట్లాడుతూ.. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి శనివారం హనుమాన్ చాలీసా నిర్వహిస్తున్నామని తెలిపారు. కాలనీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, కాలనీ కోశాధికారి సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు కొక్కెర భూమన్న, సుంకే శ్రీనివాస్, కార్యదర్శి ఎల్.సాయన్న, ఎస్సారెస్పీ ఏఈ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నర్సారెడ్డి

వేల్పూర్: మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్, రాష్ట్ర కో-ఆపరేటివ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఎస్.అన్వేష్‌రెడ్డి నాయకత్వంలో నిజామాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దామోదర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు మల్లేష్ పాల్గొన్నారు.

సమాచారం..

■ నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

మాక్లూర్: మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో నేటి నుంచి గురువారం వరకు శ్రీ లక్ష్మణ సహిత సీతారామాంజనేయ స్వామి దేవతా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. హంపి పీఠాధిపతులు విద్యారణ్య భారతి స్వామి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నందిపేట కేదారేశ్వర ఆలయ వ్యవస్థాపకుడు మంగిరాములు మహారాజ్ కూడ పాల్గొంటారని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

■ నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ ఉంటుందని తెలిపారు.

మొక్కులు తీర్చుకున్న కాంగ్రెస్ నాయకులు

బాల్కొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఆడెల్లి పోచమ్మకు మొక్కులు తీర్చుకుంటామని ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు ముడుపు కట్టుకున్నట్లు తెలిపారు. ఆదివారం పోచమ్మ వద్ద మొక్కులు తీర్చుకున్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పాలెం చిన్నారెడ్డి, నాయకులు గంగాశేషాద్రి, గంగాధర్, ఆకుల పెద్ద రాజన్న, ఆకుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

ఘనంగా బోనాల పండుగ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులు రాజారాం నగర్ నుంచి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పెద్దమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జక్కం గంగాధర్, కార్యదర్శి జంగిడి భోజన్న, సంఘం ప్రతినిధులు జంగిడి సురేష్, రవి, మొటం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్‌లో..

డొంకేశ్వర(ఆర్మూర్): మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు మొదలయ్యాయి. మొదటి రోజు ఆదివారం అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. పుట్ట ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణకు గౌడ సంఘ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.



భక్తి శ్రద్ధలతో ఈస్టర్ పండుగ



జాన్కంపేట్ ఐజీసీ చర్చిలో నృత్యం చేస్తున్న చిన్నారులు

వేల్పూర్: మండల పరిధిలోని పలు గ్రామాల చర్చిలలో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జాన్కంపేట్ ఇండిపెండెంట్ బాప్టిస్టు చర్చి, వేల్పూర్, పడగల్ సీఎస్ఐ చర్చిలలో, పచ్చలనడ్కుడ, మోతె, అక్లూర్ గ్రామాలలోని జీసస్ లవ్స్ గాస్పల్ చర్చిలో క్రైస్తవులు ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. యేసు క్రీస్తు గుడ్ ఫ్రైడే రోజున సిలువపై మరణించి, ఈస్టర్ రోజున పునః రుత్థానుడై తిరిగి జన్మించాడని పాస్టర్లు దైవ సందేశం వినిపించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి.

మాక్లూర్: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజామున క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దీపాలతో కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రధానంగా మండలంలోని మెట్టు, గద్వాల్‌క్యాంప్, మాణిక్‌భండార్, ఒడ్డేట్‌పల్లి, బోర్గాం(కె), కొత్తపల్లి, గుత్ప చర్చిలలో క్రైస్తవులు పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల చర్చి పాదర్లు రెవరెండ్ రూబేన్, వినయ్ సాగర్, చర్చి స్టువడ్ వినయ్ సాగర్, అనీల్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని సీఎస్ఐ, పెంతికోస్తు, రాకాసీపేట్‌లోని హోలీట్రినిటీ చర్చిలలో ఆదివారం ఈస్టర్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సీఎస్ఐ చర్చిలో విమెన్స్ ప్రెసిడెంట్ మృదుశీల ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులనుద్దేశించి సీఎస్ఐ చర్చి ఫాదర్ ప్రభాకర్ ప్రసంగించారు.



మెట్టులో.. క్రైస్తవులు



బోధన్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న భక్తులు

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

డొంకేశ్వర్(ఆర్మూర్): గంగాసముందర్ గ్రామంలో బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పొందిన లబ్ధిదారులతో మాట్లాడారు. కరపత్రాలు పంచుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి పార్టీని గెలిపించాలని కోరారు. ప్రధానిగా నరేంద్ర మోదీ నాయకత్వం దేశానికి అవసరమన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు పోతు గంటి సురేందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్, మురళీ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గల్లంతు కావడం ఖాయం



పార్టీలో చేరిన ఎంపీటీసీలతో భూపతిరెడ్డి

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరశివారులోని రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో సింగంపల్లి, నర్సింగ్‌పల్లి ఎంపీటీసీలు రమేష్, రాములుతోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో అమల్లోకి తెస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు విజయం సాధిస్తుందన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, ఏక కాలంలో రుణమాఫీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బోర్గాం శ్రీనివాస్, సుద్దులం శ్రీనివాస్, సాయిలు, కెతావత్ మోహన్, అంబర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలతో సోదరభావం



క్రీడాకారులతో మాట్లాడుతున్న వేణురాజ్

తెయూ(డిచ్‌పల్లి): క్రీడా పోటీలతో విద్యార్థుల మధ్య సోదర భావం పెంపొందుతుందని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్‌యూఐ) జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ పేర్కొన్నారు. ఎన్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ యూనివర్సిటీలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న క్రీడా పోటీల్లో ఆదివారం ముఖ్య అతిథిగా వేణురాజ్ పాల్గొన్నారు. క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమేనన్నారు. వర్సిటీ ఎన్ఎస్‌యూఐ కమిటీ విద్యారంగ సమస్యలపై పోరాటంతో పాటు ఇలాంటి క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్‌యూ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు. క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో తెయూ ఇంటిగ్రేటెడ్ పీజీ టీం, పీజీ టీం తలపడగా ఇంటిగ్రేటెడ్ టీం విజయం సాధించింది.

మంచాల జ్ఞానేందర్‌కు అయ్యప్ప సేవారత్న పురస్కారం

సుభాష్‌నగర్: మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే, మరోవైపు దేశ భక్తి కలిగిన మంచాల జ్ఞానేందర్‌కు అయ్యప్ప స్వామి జయంతి, ఐక్యవేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీ అయ్యప్ప సేవా రత్న పురస్కారాన్ని ఆదివారం ప్రదానం చేశారు. శ్రీశ్రీశ్రీ విద్యా శంకర భారతి స్వామి వారు మంచాల జ్ఞానేందర్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు, దేశ భక్తి కోసం చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి సేవా సమితి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు) – 11.40, 2.20, 5.00, 7.40, 10.20
- స్క్రీన్-2 – టిల్లు స్క్వేర్ (తెలుగు) – 10.20, 1.20, 4.20, 7.20, 10.20
- స్క్రీన్-3 – ది గోట్ లైఫ్ (తెలుగు) – 11.05, 6.00, 9.40
- స్క్రీన్-4 – క్రూ – 10.10, 4.10, 7.00, 10.10 ఓం భీమ్ బుష్ – 04.04